# వారపు సంత.. సమస్యల మోత

తాజా కూరగాయలు, ఆకుకూరలు, నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకే లభించే రెక్కమాను వారపు సంతపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సరైన సౌకర్యాలు లేక వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు
- దుమ్మూ, ధూళిలోనే క్రయవిక్రయాలు
- ఎండైనా.. వానైనా ఇబ్బందులు మరూ

**గాండ్లపెంట:** మండల కేంద్రం గాండ్లపెంటకు ఐదు కిలోమీటర్ల దూరంలో కురుమామిడి పంచాయతీ పరిధిలో రెక్కమాను గ్రామం ఉంది. ఇక్కడ ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతుంది. ప్రభుత్వ స్థలాలు అనువుగా లేకపోవడంతో గతంలో బస్టాండ్ వద్ద కొన్నాళ్లు, తిమ్మమ్మ మర్రిమానుకు వెళ్లే మార్గంలో ఇంకొన్నాళ్లు.. అలా ప్రస్తుతం కదిరి - రాయచోటి ప్రధాన రహదారికి సంత మారింది. ఇరువైపులా ఇక్కడి స్థల యజమానులకు అంతో ఇంతో నగదు ఇచ్చి సరుకులు అమ్ముకోవాల్సి వస్తోంది. సరిహద్దు మండలాలైన ఎన్పీ కుంట, తనకల్లు, కదిరి నుంచి వ్యాపారులు ఈ సంతలో సరుకులు విక్రయిస్తుంటారు. మూడు రోడ్ల కూడలి కావడంతో నిత్యం జనం రద్దీ ఉంటుంది. పరిసర గ్రామాల రైతులు సైతం తాము పండించిన టమాట, వంకాయ, బీరకాయ, బెండకాయ, మునక్కాయ తదితర కూరగాయలు, ఆకుకూరలతో పాటు కదిరి నుంచి వచ్చే చిరువ్యాపారులు వస్త్రాలు, తమలపాకులు, మిఠాయి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తుంటారు. రోడ్డుపై వాహనాలు వెళ్లినపుడు దుమ్ము,ధూళి వచ్చి పడుతున్నా, ఎండలు మండిపోతున్నా.. వర్షాలు పడినా అలానే ఆరుబయటే సంత నిర్వహిస్తున్నారు.


రెక్కమానులో వారపు సంతలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు

## సరైన స్థలం లేదు



నేను 20 ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నా. గతంలో రెక్కమాను బస్టాండు వద్ద ఇరువైపులా దుకాణాలు పెట్టుకుని వ్యాపారం చేశాం. ఎక్కడ కూడా ప్రధాన రహదారి సమీపంలో ప్రభుత్వ భూమి లేదు. వ్యాపారులకు ఎక్కడ స్థలం అనువుగా ఉంటుందో అక్కడ దుకాణాలు పెట్టుకోవాల్సి వస్తోంది.
– శాంతమ్మ, కూరగాయల వ్యాపారి

## ఊరికి దూరంగా ఉంటే రారు



వారపు సంతకు ఒక స్థలమంటూ లేదు. తరచూ స్థలం మారుస్తూ పోతే వ్యాపారాలు జరగడం కష్టం. ఊరికి దూరంగా ఉంటే జనం రారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు అనుకూలమైన చోట సంత నిర్వహణకు స్థలం కేటాయిస్తే బాగుంటుంది. అలాగే తగిన సౌకర్యాలు కల్పించాలి.
– ఎం.డి.పీర్, కూరగాయల వ్యాపారి

## ప్రతిపాదనలు పంపుతాం

రెక్కమాను వారపు సంతను వ్యాపారులే స్వచ్ఛందంగా నచ్చిన చోట నిర్వహించుకుంటున్నారు. గ్రామ పంచాయతీ తరఫున వారపు సంత నిర్వహించే విషయమై డీఎల్పీఓకు ప్రతిపాదనలు పంపుతాం. అధికారులు ఆదేశాల మేరకు సంత నిర్వహణ.. సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.
– డి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి

## క్లుప్తంగా

### న్యాయవాదుల దీక్ష విరమణ


న్యాయవాదులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

**కదిరి టౌన్:** న్యాయవాది రామస్వామినాయుడుపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్, ఆయన అనుచరులను అరెస్ట్ చేయాలని కదిరిలో తొమ్మిది రోజులుగా న్యాయవాదులు చేపట్టిన దీక్షను అడిషనల్ ఎస్పీ విష్ణు హామీతో బుధవారం విరమించారు. తనకు కొంత సమయం ఇస్తే న్యాయం చేస్తానని చెప్పిన అడిషనల్ ఎస్పీ.. నిమ్మరసం ఇచ్చి న్యాయవాదులతో దీక్షను విరమింపజేశారు. డీఎస్పీ శ్రీలత, సీఐ కె.వుల్లయ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో జలధి


ఉప్పార్లపల్లిలో పీర్ల ఊరేగింపు

**నల్లచెరువు:** ఉప్పార్లపల్లిలో పీర్ల జలధిని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున మూడు గంటలకే అగ్నిగుండ ప్రవేశం ఏర్పాటు చేశారు. సాయంత్రం యువకులు ఉత్సాహంగా అలావు తొక్కారు. గుండం చుట్టూ పీర్ల స్వాములను ప్రదక్షిణలు చేయించి జలధి కోసం చెరువుకు తరలించారు.

**ఘనంగా మొహర్రం**

**ముదిగుబ్బ:** చిన్నకోట్లలో బుధవారం మొహర్రం వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం పీర్లు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. అనంతరం జలధికి వెళ్లాయి.

**ఏటికి తరలిన పీర్లు**

**బత్తలపల్లి:** మండలంలోని కోడేకండ్ల, గరిశలపల్లి గ్రామాల్లో బుధవారం పీర్లు ఏటికి తరలాయి. పీర్ల స్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం స్వాములను పురవీధుల్లో ఊరేగించారు. అంతకు ముందు కోడేకండ్లలో పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో పీర్లు ప్రవేశించాయి.

### నూతన విద్యా విధానంతో నైపుణ్యాలు వెలుగులోకి


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

**పుట్టపర్తి:** కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, ఆధునిక భావాలు వెలుగులోకి వస్తాయని ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ రవిసాగర్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం బుక్కపట్నం డైట్‌లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. వ్యాయామ అధ్యాపకులు రామకృష్ణ పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు

**బత్తలపల్లి:** పశువుల్లో ముద్ద చర్మపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, గంటాపురంలో ముద్ద చర్మపు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేశారు

# క్రీడలతో మానసికోల్లాసం







బాలుర విభాగం, బాలికల విభాగం విజేత జట్లతో ఆర్డీ, ఏటీఎల్, ఆర్డీటి సిబ్బంది

**బత్తలపల్లి:** క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ రుక్మాంగద అన్నారు. ఆర్డీటీ క్రీడా మైదానంలో రెండు రోజులుగా ఆర్డీటీ–ఎఫ్‌వీఎఫ్ స్కూల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఇందులో ఆరు జట్లు పాల్గొన్నాయి. బుధవారం బాలుర విభాగంలో బత్తలపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్ల మధ్య, బాలికల విభాగంలో విజేత స్కూల్, శ్రీజ్యోతి హైస్కూల్ జట్లు మధ్య క్రికెట్ ఫైనల్ పోటీలను ముఖ్య అతిథి ఆర్డీ ప్రమీల టాస్ వేసి ప్రారంభించారు. రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బత్తలపల్లి శ్రీజ్యోతి హైస్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. అనంతరం ఆర్డీ, ఏటీఎల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలను సంస్థ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేత, రన్నర్ జట్లకు బహుమతులు అందించారు. టోర్నమెంట్‌కు సహకారం అందించిన నడిమింటి షేక్షావలి, క్రీడాకారులకు దుస్తులను అందించిన పామాల రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోచ్ జయరాం, అప్పస్వామి, ప్రవీణ్, కుమార్, రాజు, రఫీ, గంగిరెడ్డి, ఆయా పాఠశాలల పీఈటీలు, పలువురు ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా సంకష్టహర చతుర్థి


కదిరిలో ప్రత్యేక అలంకరణలో గణపతిస్వామి


హాజరైన మహిళా భక్తులు

**కదిరి టౌన్:** పట్టణంలోని ఉమామహేశ్వరి ఆలయంలో బుధవారం రాత్రి సంకష్టహర చతుర్థి వైభవంగా నిర్వహించారు. గణపతి స్వామికి పంచామృత అభిషేకం, గరిక పూజ, సంకటహర చతుర్థి వ్రత కథ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఉపవాసంతో వచ్చి పూజ అనంతరం వారు చంద్రుని చూసి ఉపవాసాలు వీడారు.

**వినాయకునికి ప్రత్యేక పూజలు**

**బత్తలపల్లి:** మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, సంగమేశ్వరక్షేత్రం తదితర గ్రామాల్లోని వినాయకునికి సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి తరువాత వచ్చే చవితిని సంకటహరచతుర్థిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు.

**నారాయణ సేవ**

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో బుధవారం శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు నారాయణ సేవ చేశారు. అన్నదానంతో పాటు పలువురికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.

# రికార్డులు సరిగా భద్రపరుచుకోండి


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివారెడ్డి

**కనగానపల్లి:** ప్రభుత్వ కార్యాలయాల్లోని రెవెన్యూ రికార్డులను సరిగా భద్రపరుచుకోవాలని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. స్థానిక రెవెన్యూ సమస్యలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతుల భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను కార్యాలయంలో సక్రమంగా భద్రపరుచుకోవాలని మండల రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ రికార్డులు ఎటువంటి అగ్ని ప్రమాదాలకు, చోరీలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల ఆన్‌లైన్ నమోదు, రైతుల భూ తగాదాలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సీఎస్‌డీటీ కవిత, సీనియర్ అసిస్టెంట్ దేవిపుత్ర, ఆర్‌ఐ సరళ, పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి**

**ధర్మవరం రూరల్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌డీఓ శివారెడ్డి, డీఎల్‌పీఓ శివమణి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, సచివాలయాల్లో ప్రజలకు అందించాల్సిన సేవలపై ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు.

**చట్టాలపై అవగాహన తప్పనిసరి**

**చెన్నేకొత్తపల్లి:** ఒంటికొండ గ్రామంలో బుధవారం టింబక్టు కలెక్టివ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభా సొసైటీ మేనేజర్ జయశ్రీ, సొసైటీ సభ్యులు మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**చేపలు పట్టుకునేందుకు రేపు వేలం**

**నల్లచెరువు:** పంతుల చెరువు, ఇందుకూరిపల్లి నీటి కుంటలో ఏడాదిపాటు చేపలు పట్టుకునేందుకు ఈ నెల 26న పంతులచెరువు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ స్వర్ణలత బుధవారం తెలిపారు.

**పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి**

**ధర్మవరం అర్బన్:** నిబంధనలు పాటించని జీవన జ్యోతి పాఠశాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాల ముందు బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్ట్ పేరుతో అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అనధికారికంగా నిర్వహిస్తున్న హాస్టల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

## సంక్షిప్త సమాచారం

**తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి**


కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

**కదిరి అర్బన్:** కదిరి సబ్ డివిజన్ తపాలా ఉద్యోగులు బుధవారం తపాలా సేవలపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్, నవీన్, భరత్, రామచంద్ర పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** తపాలా శాఖ ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ రాజేష్ తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని తపాలాశాఖ కార్యాలయంలో బుధవారం ఖాతాదారులు, ప్రజలకు తపాలా సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

**ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

**తనకల్లు:** గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ అన్నారు. మండల పరిధిలోని కోటపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ క్యాంపును బుధవారం ఆయన పరిశీలించారు.

**ప్రకృతి వ్యవసాయంతో బహు లాభాలు**

**పుట్టపర్తి అర్బన్:** ప్రకృతి వ్యవసాయంతో బహు లాభాలు ఉన్నాయని ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. బుధవారం కొట్లపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను ఏడీఏ సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో బహుళ పంటలను సాగు చేయడంతో రోజూ, వారానికి, నెలకు ఒక సారి ఆదాయం పొందవచ్చన్నారు.

**టీకాలు తప్పనిసరి**

**తాడిమర్రి:** చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని వైద్య సిబ్బంది సూచించారు. తాడిమర్రితో పాటు ఎం.అగ్రహారం, కునుకుంట్ల, నార్శింపల్లి, పెద్దకోట్ల, పిన్నదరి, దాడితోట, చిన్నచిగుళ్లరేవు, చిల్లవారిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు.

**డిగ్రీ అడ్మిషన్లకు నేడే ఆఖరు**

**ధర్మవరం అర్బన్:** డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు గురువారం ఆఖరు అని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

### రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**తలుపుల :** రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఓబులరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి బుధవారం తెలిపారు. మంగళవారం అనంతపురం ఆర్డీటీ మైదానంలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. వీరిలో బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని రోహిణి, ఎనిమిదో తరగతి విద్యార్థి కుందన్ యాదవ్, తొమ్మిదో తరగతి విద్యార్థి సతీష్ ఎంపికయ్యారు. వీరు ఆగస్టులో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### డిప్లొమా కాలేజీలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

**లేపాక్షి:** ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో కుడుముల కుంటే పారిశ్రామికవాడలోని కర్ణాటక ప్రభుత్వ డిప్లొమా కళాశాలలో (గవర్నమెంట్ టూల్ రూం అండ్ ట్రెనింగ్ సెంటర్) ఏపీ విద్యార్థులకు సైతం అడ్మిషన్లకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ హరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ టూల్ అండ్ డైమేకింగ్, డిప్లొమా ఇన్ మెకట్రానిక్స్, డిప్లొమా ఇన్‌ప్రిసిషన్ మ్యానుప్యాక్చరింగ్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7348342369, 9731684439 సంప్రదించాలని సూచించారు.

### ఉత్సాహంగా క్రీడా పోటీలు

**పుట్టపర్తి రూరల్:** క్రీడలు శారీరక మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని పీడీ రమేష్‌బాబు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా ప్రభుత్వ పాఠశాల్లో బుధవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**బహుమతుల పంపిణీ**

**చెన్నేకొత్తపల్లి:** మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

### న్యామద్దెలలో డెంగీ కేసు

**చెన్నేకొత్తపల్లి:** న్యామద్దెల గ్రామానికి చెందిన కావ్య అనే మహిళకు డెంగీ జ్వరం సోకింది. వివరాలిలా ఉన్నాయి. కావ్య ప్రసవం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. రక్త పరీక్షల్లో ఆమెకు డెంగీ సోకినట్లు తేలింది. ఈ మేరకు డివిజనల్ మలేరియా అధికారి జయరామనాయక్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన స్థానిక వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. డెంగీ సోకిన మహిళను చికిత్స నిమిత్తం 108లో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం సిబ్బందితో గ్రామానికి చేరుకుని మహిళ ఉన్న ఇంటి లోపల పైరిత్రియం మందు పిచికారీ చేయించారు. అలాగే ఇంటి ముందు నీటితొట్టిని పరిశీలించగా అందులో దోమల లార్వా ఉన్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల విచారించిన వైద్య సిబ్బంది.. ఎవరికీ జ్వరాలు సోకలేదని నిర్ధారించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్ రెడ్డి, ప్రమీలమ్మ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

### గ్రంథాలయ పితామహుడికి నివాళి

**కనగానపల్లి:** గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్యకు పలువురు నివాళులు అర్పించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు వెంకరమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గోవిందు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను కొనియాడారు.

### బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం

**పుట్టపర్తి:** కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు అడపాల వేమనారాయణ అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు చేసుకునేందుకు సహకరిస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.50 కోట్లు మాత్రమే ఇస్తామనడం మోసపూరితమేనన్నారు.

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఎన్పీకుంట:** మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్‌ఐ శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, రోడ్డు భద్రతా నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐతో పాటు ఎంఈఓ సుబ్బిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శిరీషా రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.